# మిస్టర్ పరిష్కారం

- ప్రఫుల్ల చంద్ర

“నేను అసమర్థుణ్ణి. సంపాదించడం చేతగాని వాణ్ణి. శరీరానికి వయసు ముప్ఫయి ఏళ్ళు అయినా మనసుకు షష్టిపూర్తి జరిగింది. అందుకే నా కెవ్వరూ పిల్ల నివ్వ లేదు. పెళ్ళీ పెటాకులూ లేక అఘోరిస్తున్నా.”

నా గురించి, నా కంటే బాగా తెలిసిన మా ఆఫీసు వాళ్ళు నాకు అడగకుండా ప్రసాదించిన సర్టిఫికేట్లు ఇవి!

వాటిలో—కనీసం కొన్నిటిలో—కొంత నిజం లేకపోలేదని నాకూ అనిపిస్తూ ఉంటుంది.


జీతాల రోజున మావాళ్ళు మందు కొడతారు. కాబరేకు వెళతారు. పేక ఆడుతారు. జల్సా చేస్తారు. నాకు కాబరే అంటే గాభరా! మందు కాదు కదా—కూల్ డ్రింక్ అయినా పుచ్చుకోను. పేకాట కాదు కదా—'పులి—మేక' ఆట కూడా రాదు. ఎప్పుడో కాని సినిమాలు చూడను. పైగా పంచె, లాల్చీ ధరిస్తాను. అందుకు కారణం—పెద్ద మనిషిగా చెలామణీ కావాలన్న దురాశ కాదు. కేవలం ఆర్థికం!

నాది ఒక్క చేతి సంపాదనే. రెండవ చేతిని టేబుల్ క్రింద పెట్టడం నాకు చేతగాని విద్య. సంసార బాధ్యత హెచ్చు. స్వంత ఇల్లు ఉంది. కాబట్టి ఏదో గుట్టుగా రథం లాగేస్తున్నాను.

పెళ్ళి గురించి మాత్రం మా వాళ్ళు చెప్పేది శుద్ధ అబద్ధం. పిల్లనిస్తామని చాలా మంది వచ్చారు. అమ్మ తెగ పోరు పెడుతున్నది. కాని, తమ్ముడు రెండేళ్ళలో డాక్టర్ అవుతాడు. ఆ తరవాత నా పెళ్ళి అని తిరుగులేని నిర్ణయం తీసుకున్నా.

ఈ సర్టిఫికేట్లు కాక మా వాళ్ళు నా కిచ్చిన బిరుదులు రెండు ఉన్నాయి.

మొదటిది సాహత్య (సాహిత్య కాదు) సమ్రాట్! నేను వ్రాసే కథలు సంవత్సరానికి మూడు, నాలుగు పత్రికల్లో వస్తూ ఉంటాయి. సాహిత్యాన్ని యథాశక్తి హత్య చేస్తున్నానని వాళ్ళ అభిప్రాయం. అందుకే ఆ బిరుదు!




ఇక రెండవది నల్లి శ్రీ! ఆఫీసుకు గంట ఆలస్యంగా రావడం, గంట ముందే వెళ్ళిపోవడం మావాళ్ళ అలవాటు. నేను సరిగా టైముకు వచ్చి, వెళుతూ ఉంటా. నల్లిలా కుర్చీని పట్టుకు కూర్చుంటానని ఈ బిరుదు!

నవ్వలేని వాడు నరుడు కాదు. అందుకని వాళ్ళెంతగా వేళాకోళం పట్టిస్తున్నా నేను నవ్వేసి ఊరుకుంటా.

ఆఫీసులో బేబీ చేరడంతో వాతావరణమే మారిపోయింది. బేబీ అంటే అమ్మాయి కాదు. ఆఫీసులో అందరికన్నా చిన్నవాడని అతని కా బిరుదు! అతనికి హడావుడి ఆరవ ప్రాణం. సరాసరి కాలేజీ నుండి వచ్చాడు. క్లాసు రూమ్‌కూ, ఆఫీసు రూమ్‌కూ తేడా తెలియనివాడు. క్లాసు రూమ్‌లో టేబుల్ మీద కూర్చుని స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటున్నట్టే ఇక్కడాను. అతడు సీట్లో కూర్చోగా ఎవరూ చూడ లేదు. అసలు అతని సీటేదో ఎవరికీ తెలియదు! ఎప్పుడు చూసినా ఎవరితోనో కబుర్లు చెబుతూ కనుపిస్తాడు. అతడు జనరల్ మేనేజర్‌కు దగ్గరవాడు. అందుకే ఎవరూ అతనికి పనులు చెప్పరు. అతడు పాడింది పాట! వేసింది జోకు!

ఉన్నవి చాలనట్టు—అదిగో, అతగాడు నాకొక బిరుదు ప్రసాదించాడు—డాడీ!

అలా పిలిచి ఊరకున్నా బాగుండేది. “పెళ్ళి ఎప్పుడుచేసుకుంటావ్, డాడీ?” అని అడిగా డొకసారి. అదొక బ్రహ్మాండమైన జోక్ అయినట్టు అందరూ పగలబడి నవ్వేశారు. నేనూ నవ్వేశాను కాని, ఆ నవ్వు హాయిగా లేదని నాకే తెలుసు.

క్రిందటి వేసవిలో బేబీ నాలుగైదు పెళ్ళి చూపులకు వెళ్ళినట్టున్నాడు. ఆ వివరాలూ, అమ్మాయిల అంగాంగ వర్ణనలూ—అతని కబుర్ల సారాంశం.

“డాడీ! నీ వెప్పుడూ పెళ్ళి చూపులకు వెళ్ళ లేదా?” అడిగా డొకసారి.

“డాడీ పెళ్ళి చూపులకు వెళితే—అమ్మాయిలు కటడా—డాడీ! అని పిలిచి పారిపోతున్నారట!” ఒక మిత్రుని వ్యాఖ్య.

కూనాగి వేళాకోళాలు హద్దులు మీరుతున్నట్టు అనిపించింది కాని, ఉడుక్కుంటే మరింత అలుసు.

బేబీ పనీ పాటా లేకుండా తిరుగుతున్నట్టు సెక్షన్ మానేజర్ కనిపెట్టి క్రమంగా ఫైళ్ళు అప్పజెప్పడం మొదలు పెట్టాడు. కాని, ఆ ఫైళ్ళను మిత్రులకు తలా ఒకటి పంచి తను మామూలుగానే కబుర్లతో కాలక్షేపం చేస్తున్నాడు బేబీ.

ఒకనాడు నా వద్దకు వచ్చాడు. “డాడీ!! డాడీ!! దీనికి డిస్పోజలు వ్రాయి మా—సాయంకాలం. మందు కొట్టిస్తాను లే...సారీ! నీకు మందు పడదు కదూ? పోనీ... ముంద?” గల గల మాట్లాడేస్తున్నాడు.

నిశ్చలంగా అతని వైపు చూశాను. “డిస్పోజలు వ్రాయడం కూడా చేతకాదా నా కొడకా! అక్కడ పెట్టు. తరవాత చూస్తా లే.”

బేబీ ముఖం జేవురించింది. చుట్టూ ఉన్న, విన్న వారందరి చూపులూ ఇటు తిరిగాయి. నోళ్ళు మూసుకుపోయాయి. నా మాటల్లో ఎంత పదును ఉందో అప్పుడు తెలిసింది నాకు!


CHANDRA

ఫైలు తీసుకుని చర చర వెళ్ళిపోయాడు బేబీ. అంతే. ఆ నాటినుండి నాకు బిరుదులూ, సర్టిఫికేట్లూ ఆగిపోయాయి.

వారం రోజులు గడిచాక బేబీ పెళ్ళి నిశ్చయం అయినట్టుంది. అతని మిత్రులు ఒకటే హడావుడి. బేబీ ఒకటే వాగుడు. కాబోయే భార్య ఆస్తిపాస్తులు, అందచందాలు, అంగాంగ వర్ణన, పెళ్ళయాక తాను చేయబోయే ఘన కార్యాలు—ఇవీ చర్చనీయాంశాలు.

ఎంత వద్దనుకున్నా ఈ మాటలు నా చెవిని పడేవి. కాబోయే భార్య గురించి ఇలానా మాట్లాడ్డం?—అని విస్తుపోయాను. అయినా నాది షష్టిపూర్తి మనసు. కుర్రకారు అభిరుచులు నాకు పట్టవు. ఎవరెలా మాట్లాడుకుంటే నా కెందుకు?—అని సరిపెట్టుకున్నా.

నలుగురు ఆత్మీయుల్ని మాత్రం స్వంత ఖర్చుల మీద పెళ్ళికి తీసుకువెళ్ళాడు బేబీ. వెళ్ళిన వాళ్ళు వెళ్ళినట్లే తిరిగి వచ్చారు మరునాడు ఆఫీసుకు—బేబీ తప్ప. అందరి ముఖాలూ కంద గడ్డల్లా ఉన్నాయి. అందరూ పెళ్ళికూతుర్ని తిట్టడమే.

విడిదిలో దిగుతూనే వీళ్ళు బుడ్డీల కోసం కాబోయే మామగారికి కబురు పంపారు. ముందు ఆయన ఆశ్చర్యపోయాడు. తరవాత పట్నం నుండి తెప్పించాడు. గంటలు గడుస్తున్న కొద్దీ వీళ్ళ దాహం ఎక్కువ కాజొచ్చింది. ఆయన ఓరిమి నశించింది. నాలుగవ వాయ బుడ్డీలు రాలేదు. అవి వస్తే కాని మావాడు మూడు ముళ్ళూ వేయడని వీళ్ళు అల్టిమేటం పంపారు మామగారికి.

"ఇలాంటి తాగుబోతునూ, స్నేహితులు ఆడించేటట్టు ఆడే వాజమ్మనూ నేను చేసుకోను గాక చేసుకోను" అని పెళ్ళికూతురు సత్యాగ్రహం మొదలు పెట్టింది. పెళ్ళి పెటాకులయింది.

వీళ్ళు వెర్రి ముఖాలు వేసుకుని తిరిగి వచ్చారు.

నాకు చాలా ఆనందం అయింది. ఆ మగువ తెగువను మనసులోనే అభినందించాను. ఏమైతేనేం? నాకు కథా వస్తువు దొరికింది!

ఈ సంఘటన జరిగిన మూడేళ్ళకు—

తమ్ముడికి ప్రభుత్వపు ఆసుపత్రిలో ఉద్యోగం దొరికింది. మొదటి జీతంలోంచి నాకూ, అమ్మకూ బట్టలు పెట్టాడు. "ఒరేయ్ అన్నయ్యా! నీవు పెళ్ళి చేసుకుని నాకు లైన్ క్లియర్ చేయకపోతే చూడు ఏం చేస్తానో!" అని అల్టిమేటం ఇచ్చాడు.

హఠాత్తుగా నాకు విశాఖ బదిలీ అయింది.

అక్కడ ఆఫీసరు కాస్త స్ట్రిక్ట్. ఆఫీసులో గోల లేదు. పనులు సాఫీగా జరుగుతున్నాయి. వాతావరణం నాకు నచ్చింది. ఆఫీసుకు దూరంగా చిన్న ఇల్లు దొరికింది. స్వయంపాకంతో ఏదో కాలక్షేపం చేసేస్తున్నా. ఉదయం భోజనం చేసి ఆఫీసుకు వస్తే మళ్ళా సాయంకాలమే ఇంటికి వెళ్ళడం. హోటల్ కూడా ఆఫీసుకు దూరమే. చాలా సార్లు బద్ధకించి మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో కూడా ఆఫీసులోనే గడిపేస్తున్నా.

అదిగో—అలా ఆఫీసులో ఉండిపోయిన ఒక సారి సుగుణ పలుకరించింది. తాను తెచ్చుకున్న టిఫిన్ ఇవ్వబోయింది. కాఫీ మాత్రం తీసుకున్నా. నేనుంటున్న వీథి చివరనే వాళ్ళ ఇల్లట. అందువల్ల ఆఫీసు అయాక ఇంటికి వెళుతూ మా ఇంటి వద్ద కాస్సేపు ఆగేది. కబుర్లు చెప్పేది. వస్తువులు సర్ది పెట్టేది. వంట నేర్పేది. ఒక్కోసారి తనే వండేది. ఆఫీసుకు రిక్షాలో వెళుతూ మా ఇంటిముందు ఆగి పచ్చళ్ళూ గట్రా అందించేది.

ఆమె సహృదయత నాకు నచ్చింది.

ఒక సెలవు రోజు—

భోజనం అయాక వార పత్రిక చదువుకుంటూ మంచంమీద దొర్లుతున్నా. ఆ పత్రికలో నా 'ఆదర్శ వనిత' పడింది. బేబీ లాంటి తాగుబోతునూ, స్నేహితులు ఆడించేటట్లు ఆడే వాజమ్మనూ చేసుకోనని సత్యాగ్రహం చేసిన అమ్మాయి కథ. ఆ అమ్మాయి తరవాత ఉద్యోగం చేసుకుంటూ హాయిగా ఉన్నట్లు కథ ముగించాను.

మూడేళ్ళ క్రితం వ్రాసిన కథ. సంపాదకుల చుట్టూ తిరిగి తిరిగి, నమ్మకంగా నన్ను చేరుకునేది ఏదో ఒక నాటికి. దానిని మార్చి మార్చి, మాసికలు వేసి వేసి మరొక పత్రికకు పంపేవాడిని. ఇలా తిరుగుతూ, తిరుగుతూ చివరికి విసుగేసి ఈ పత్రికకెక్కిందా కథ.

కాకి పిల్ల కాకికి ముద్దు. నా కథ నాకు ముచ్చట. ఆ కథకు వేసిన చిత్రాన్ని చూస్తూ మురిసిపోయాను. ముచ్చటగా మూడవసారి చదువుకుంటున్నప్పుడు సుగుణ వచ్చింది.

ఆఫీసుకు వెళుతూనో, ఆఫీసు నుండి వస్తూనో మా ఇంటిని పావనం చేయడం ఆమె అలవాటు. ఈ వేళ పని కట్టుకుని మరీ వచ్చింది. ఆమెను కూర్చోమని పక్క గదిలోకి వెళ్ళాను కాఫీ కలపడానికి. సాధారణంగా నాచేత పని చేయనిచ్చేది కాదు. తనే కాఫీ కలుపుకుని నా కొక కప్పు ఇచ్చేది. ఈ వేళ ఆ పని నా కప్పగించి, తనేమో పత్రిక తిరగేస్తూ కూర్చుంది. గంభీరంగా ఉంది. ఏమిటో విశేషం! ఇంట్లో తగువు పడి వచ్చినట్లుంది. ఆమె చెబితే వినడమే కాని, నేనెప్పుడూ ఆమె కుటుంబ విషయా లడగలేదు. తగాదా పడడానికి ఆమె ఇంట్లో ఎవరున్నారు? పదవ క్లాసు చదివే తమ్ముడు. తలిదండ్రులకు ఈమె ఉద్యోగం చేయడం ఇష్టంలేక స్వగ్రామం వదిలి రాలేమన్నారట.

కాఫీ తెచ్చాను.

ఆమె నా కథే చదువుతూంది.

"ఎలా ఉంది?" ఆత్రత కనబడనీయకుండా అడిగాను.

"ఏడిసి నట్టుంది!" అంది టక్కున.

ఎంత నిజం అయినా, మరి ఇంతలా కుండ బద్దలు గొట్టినట్టు చెప్పడమేనా?

"ఏడిసినట్టు ఎందుకు ఉందట?" నిస్పృహను అణుచుకుంటూ అడిగాను.

"ఒక సమస్యకు ఒక పరిష్కారం చూపాడు రచయిత. కాని, అలా చేస్తే ఒక అబల ఎదుర్కొనే చిక్కులను ఊహించలేకపోయాడు. పెళ్ళి పెటాకులు లేని ఉద్యోగిని ఆయన దృష్టిలో సుఖంగా ఉండగలదు. కాని వాస్తవం అది కాదు. ఏ స్త్రీ అయినా రచయిత సూచించినట్లు చేస్తే ఆమెకు పిడికెడు సానుభూతి కూడా దొరకదు. అసలు పెళ్ళే కాదు. ఎందుకిలా చేశానా అని కుళ్ళి కుళ్ళి చావాలి. అసలు రచయిత సమాజానికి అద్దం పట్టాలి. కాని, ప్రతి సమస్యకూ ఏదో ఒక పరిష్కారం చూపే 'మిస్టర్ పరిష్కారం' కాకూడదు రచయిత!"

"కరెక్ట్! నా భావం కూడా అదే! కాని, నేనొక కథలో హీరోయిన్ ఆత్మహత్య చేసుకున్నట్టు వ్రాస్తే దాని మీద ఎన్ని విమర్శలు! ఆత్మహత్య పరిష్కారం కాజాలదనీ, పరిష్కారం చూపని రచయిత అసలు రచయితే కాడనీ.."

ఇంకా ఏదో చెప్పబోతూ — ఆమె ముఖంలో అంత ఆశ్చర్యం ఎందుకో అర్థం కాక ఆగాను.

"మీరు కథలు వ్రాస్తారా? ఇది మీరు వ్రాసిందేనా?" ఆశ్చర్యంగా అడిగింది.

అప్పుడు నాలుక కరుచుకుని ప్రయోజనం ఏమిటి?

"సారీ! ఘాటుగా విమర్శించినట్టున్నాను!"

"గులాబీ పువ్వుతో కొట్టినట్లుంది. ముల్లు గుచ్చుకుంది. మృదుత్వమూ తెలిసింది" అన్నాను నవ్వేస్తూ.

"అబ్బో! మీరు నిజంగా రచయితే!"

"ఈ కథ ఎలా ముగిస్తే బాగుండేది?"

## ప్రేమకు గీటురాయి

మగవారి విషయంలో ఆడవారు చూపే ప్రేమకు కొలబద్ద–మగవాడు తన కర్తవ్యాన్ని నిర్వహించేటట్లు చేయటం ఒక్కటే.

—మలాక్

"ఒక విధంగా అది నా కథే! నా కథను ఎలా ముగించుకోవాలో నాకే తెలియదు" అంది విషణ్ణంగా.

ఆశ్చర్యపోవడం ఇప్పుడు నా వంతు అయింది. "మీరు... మీరు...మా బేబీ... అంటే భాస్కరరావును తిరస్కరించినది మీరేనా?!"

"ఆ భాస్కరరావు మీ స్నేహితుడా?! అతడు తాగుబోతని తెలిసిన క్షణంలో నాలో ఆవేశం పెల్లుబికింది. సత్యాగ్రహం చేశాను. పెళ్ళి ఆగిపోయింది. వాళ్ళు వెళ్ళిపోయారు. తరవాతే ఆరంభమయాయి, నా సమస్యలు. అమ్మా, నాన్నా తిట్టిపోశారు. కొట్టారు కూడా. తమ్ముళ్ళూ, చెల్లాయిలూ వేళాకోళం పట్టించారు. బంధువులు మాతులు విరుచుకున్నారు. నేనొక రౌడీనని పేరుపడిపోయాను. నన్ను పెళ్ళి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. మా నాయనమ్మ ఆ దిగులుతోనే చనిపోయింది. నేనే చంపేశా నన్నారు. ఇంట్లో పోరు భరించలేక ఉద్యోగానికి అప్లై చేశాను. అదృష్టవశాత్తు ఈ పూళ్ళో దొరికింది. అదొక అవమానంగా భావించారు నాన్న. ఇంకో వూరులో ఉద్యోగం చేయడం మంచిది కాదన్నారు బంధువులు. అమ్మను తీసుకు రావాలనుకున్నా. ఎవరూ రామన్నారు. అయినా, నేను రావడానికే నిశ్చ

యించుకున్నా. తన మాట ఖాతరు చేయకుండా వెళితే కూతురు చచ్చింది — అనుకుంటా నన్నారు నాన్న. నాకు తిక్క రేగింది. అలాగే అనుకోండి — అని వచ్చేశాను. నేను ఉద్యోగంలో చేరాక చెడిపోయా నన్నారు. పొగరు బలిసింది అన్నారు. కుటుంబాన్ని చూడడం లేదన్నారు. నేను చచ్చానని భావిస్తున్న నాన్నగారు—చదువు మిషతో తమ్ముణ్ణి నా వద్దకు పంపారు. వాడు వచ్చింది చదువు కోసం. చేస్తున్నది నా మీద సి. ఐ. డి. పని! నేను మీతో కాస్త చనువుగా ఉంటున్నానని వాడు నాన్నగారికి వ్రాసినట్టున్నాడు— ఆయనగారు నిన్నరాత్రి వేంచేశారు. నా వల్ల చెల్లెళ్ళకు సంబంధాలు రావడం లేదనీ, ఉద్యోగం మానేసి ఇంటికి వచ్చెయ్యమనీ ఒకటే పని! ఈ ఉదయం పెద్ద ఘర్షణ. నేను ఇంటికి రాను గాక రాను — అని ఖచ్చితంగా చెప్పేశాను. అంత ఘర్షణ జరిగాక నా ఇంటిలోనే నేను ఉండలేక పోయాను. పిడికెడు సానుభూతి కోసం ముష్టిదానిలా స్నేహితురాళ్ళ ఇళ్ళ చుట్టూ తిరుగుతున్నా — ఉదయం నుండీ. వాళ్ళ కంటే రాళ్ళే నయం! చివరికి ఇదిగో, మీ ఇంటికి వచ్చా" అంది బరువుగా.

"నేను రాయిని కాను లెండి!"

నా జోక్సు అందుకునే స్థితిలో లే దామె.

"నా సమస్యకు పరిష్కారం చెప్పండి, మిస్టర్ పరిష్కారం!" అంది, స్వేచ్ఛగా మాట్లాడడానికి ప్రయత్నిస్తూ. కాని, జలజల రాలుతున్న కన్నీళ్ళను ఆపలేకపోయింది. "ఇలాంటి పరిస్థితి ఏ ఆడపిల్లకూ వద్దు! నేను కిక్కురు మనకుండా ఆ బాస్కరాన్నే చేసుకుంటే బాగుండేదని పిస్తోంది. చేతనైతే అతనిని మార్చుగలిగేదాన్ని. లేకపోతే తాగుబోతు పెళ్ళాంగా అందరి గుండెల్లో నా కింత సానుభూతి అయినా మిగిలేది. నే నిప్పుడు అందరికీ శత్రువునైపోయాను. అందరూ నన్ను వేటాడే వారే" అంటూ ఉండగానే ఒక వయసు మళ్ళి నాయన మా ఇంట్లో ప్రవేశించాడు. అతని వెంట వచ్చిన అబ్బాయి గుమ్మం వద్దనే ఉండి పోయాడు.

"నీ విక్కడ ఉన్నావా, తల్లీ!" వెటకారంగా అన్నా డాయన.

సుగుణ కళ్ళు తుడుచుకుంది.


"సిగ్గు లేక పోతే... పరాయి మగవాడి కొంపలో. పట్టపగలు." అన్నాడు అసహ్యంగా. రాత్రి ఎవరూ చూడకుండా అయితే ఫర్వాలేదేమో!

"నేను రాను! మీరు వెళ్ళండి" అంది సుగుణ, దృఢంగా. ఆమె ధైర్యానికి విస్తుబోయాను.

ఇక ఆమెతో వాదన లాభం లేదనుకున్నాడు కాబోలు — ఆయన నా మీద పడ్డాడు. "ఏమయ్యా! నీకైనా బుద్ధి లేదా? పరువుగల ఆడపిల్లను ఇంటికి రప్పించుకుని..."

నేను సాధారణంగా ఏ విషయంలోనూ తొందరపడను. దూర్వాసులంటే అంతు తేల్చకుండా వదలను.

"బుద్ధి లేనిది నీకు! మర్యాద తెలియనిది నీకు! పెర్మిషన్ లేకుండా నా ఇంట్లో ప్రవేశించి నన్నే




దబాయిస్తున్నావా? 'గెట్ అవుట్!'" గర్జించాను. సుగుణ కళ్ళలో ఇప్పటికి వెలుగు వచ్చింది.

దానితో ఖంగు తిన్నాడు దూర్వాసుడు! "అది కాదు, నాయనా" అంటూ కాళ్ళ బేరానికి వచ్చాడు.

"అసలు దూరం చేసుకున్నది మీరు! ఇప్పు డే ముఖం పెట్టుకుని ఆమె మీద పెత్తనం చలాయించడానికి వచ్చారు? ఆమె పసిపాప కాదు— కొట్టి, తిట్టి మీ మార్గంలోనికి మళ్ళించడానికి. మైనపు ముద్ద కాదు— మీరు మలచిన ఆకారం పొందడానికి! ఆమె మేజరు! ఆమె అభీష్టానికి వ్యతిరేకంగా — మీరు కాదు, నేను కాదు, ఎవరూ ఏమీ చేయలేరు. మీరు అవమానించకుండా సగౌరవంగా చూస్తారన్న నమ్మకం కలిగితే, ఆమె ఇష్టం అయితే మీ ఇంటికి వస్తుంది. మీరే ఆమె ఇంటికి వచ్చి, పైగా ఆమెనే తిట్టే నైతిక హక్కు మీకు లేదు. వెళ్ళండి!"

నే నంత ఏకధాటిగా ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడలేదు. నా మాటలు ఆయన హృదయాన్ని గుచ్చి, మెదడును మేల్కొలిపినట్టు ఉన్నాయి. తలవంచి బయటికి నడిచాడు. ఆ వెనక ఆ అబ్బాయి.

నమ్మలేని విషయాన్ని చూస్తున్నట్టు అంత లేసి కళ్ళ నిండా ఆశ్చర్యం నింపుకుని నా వైపే చూస్తున్నది సుగుణ. నిజం చెప్పవద్దూ? నేను ఆ క్షణంలో రెండు మీటర్ల పొడుగు ఎదిగినట్లు అనిపించింది.

"నీ సమస్యకు పరిష్కారం అడిగావు కదూ?" అంటూ ఆమె నడుము చుట్టూ చేయి పోనిచ్చి దగ్గరగా లాక్కుని కన్నీళ్ళు తుడిచాను.

"ఇదే పరిష్కారం" అంటూ హృదయానికి హత్తుకున్నా.

"మై డియర్, మిస్టర్ పరిష్కారం! ఐ లవ్ యూ!" కళ్ళు మూసుకుని అంది సుగుణ. *

